నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 28 జనవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

- 'ఖమ్మం'లో తొలి రోజు 20 వేల మంది రైతులకే సాయం
- మిగిలిన 3.50 లక్షల రైతులకు సాయంపై స్పష్టత కరువు
- సీఎం ప్రకటనతో పొద్దంతా ఫోన్‌తో ఎదురుచూపులు
- ఎంతసేపు చూసినా రైతుల ఫోన్లలో మోగని మెసేజీల శబ్దాలు
- సంక్రాంతి, రిపబ్లిక్ డే, మార్చి 31 అంటూ సీఎం గడువులు
- ప్రతిసారీ మాట మార్పులు.. భావోద్వేగంలో కర్షకులు
- భద్రాద్రి జిల్లాలోనూ 22,125 మంది ఖాతాలకే జమ..
- ఇంకా 1,87,597 రైతులకు పంటల సాయం పెండింగ్

మాటిమాటికీ మాటలు మారుస్తూ నోటికొచ్చిన గడువులు చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు మండిపడుతున్నారు. రైతుభరోసా విషయంలో పూటకో మాట చెబుతూ రోజురోజుకూ తమకు ఆశలు కల్పించేలా ప్రకటనలు చేస్తూ తమ భావోద్వేగాలతో ఆటలాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇస్తామంటూ నమ్మబలికిన ప్రభుత్వం.. ఏడాది దాటినా ఆ సాయాన్ని ఇవ్వడం లేదు. పైగా రూ.12 వేలకు కుదించి గడువులు పెడుతూ కాలం గడుపుతోంది. ఇప్పటికే డిసెంబర్ 9, సంక్రాంతి, రిపబ్లిక్ డే అంటూ తేదీలు ప్రకటించిన ప్రభుత్వం వీటిల్లో ఏ తేదీలోనూ ఇచ్చిన మాట ప్రకారం రైతుభరోసా ఇవ్వలేదు. పైగా మొన్నటికి మొన్న నారాయణపేట జిల్లా సభలో 17 నిమిషాల వ్యవధిలోనే సాక్షాత్తూ ముఖ్యమంత్రే మాట మార్చారు. తొలుత జనవరి 26నే జమ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొద్ది సేపటి తరువాత 31లోపు జమ చేస్తామంటూ గడువు పెంచారు. దీంతో రైతులందరూ నిశ్చేష్టులయ్యారు. సభావేదిక సాక్షిగా మళ్లీ గడువు పొడిగించడంతో భావోద్వేగానికి గురయ్యారు. ఆ తరువాత ఆ గడువునూ మార్చారు. అలాగే, పథకాల మంజూరు పత్రాల పంపిణీకి మండలానికి ఒక పైలట్ గ్రామాన్ని ఎంపిక చేశారు. రిపబ్లిక్ డే నాడు ఆ గ్రామాల్లో ఇటీవలి నాలుగు పథకాలకు ఎంపికైన అర్హులకు పత్రాలు అందించారు. ఇదే క్రమంలో ఈ పైలట్ గ్రామంలోని రైతులకు మాత్రమే సోమవారం రైతుభరోసా పంటల పెట్టుబడి సాయాన్ని జమ చేశారు. కానీ ముఖ్యమంత్రి మాటలను విశ్వసించిన ఉమ్మడి జిల్లా రైతులు సోమవారం ఉదయం నుంచి రాత్రి దాకా రోజంతా సెల్‌ఫోన్లలోకి చేస్తూ.. రైతుభరోసా సాయం జమ అవుతుందేమోననే ఆశతో ఎదురుచూశారు. అర్ధరాత్రి దాటినా రైతుభరోసా సందేశం రాకపోవడంతో ముఖ్యమంత్రిని తిట్టుకుంటూ నిట్టూర్చారు.

- ఖమ్మం వ్యవసాయం, జనవరి 27

రైతుభరోసా పెట్టుబడి జమ అయిందేమోనని చూసుకుంటున్న జూలూరుపాడు మండలం పాలకొల్లు రైతు

పైలట్ రైతులకే భరోసా

పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకూ కాకుండా కేవలం ఎంపిక చేసిన గ్రామాల రైతులకు మాత్రమే మొదటి రోజున రైతుభరోసా సాయం జమ అయింది. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు అర్హుల ఎంపిక కోసం ఈ నెల 21 నుంచి 24 వరకూ గ్రామసభలు నిర్వహించిన విషయం విదితమే. వాటిల్లో అర్హత సాధించిన లబ్ధిదారులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న ఆయా పథకాల లబ్ధిని పంపిణీ చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించి ఉంది. కానీ ఆ గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా లేకపోవడం, జాబితా నిండా అనర్హుల పేర్లే ఉండడంతో అర్హుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. చివరికి అర్హుల జాబితాలో తమ పేర్లు రాలేదంటూ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆయా పథకాల దరఖాస్తుదారులు ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో పథకాల జాబితాలో పేర్లు రాని అర్హులు అదే గ్రామసభల్లో మరోసారి దరఖాస్తు చేసుకోవాలంటూ ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో దరఖాస్తులు అధికంగా రావడంతో అప్పటికప్పుడు వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను ఎంపిక చేయడం సాధ్యం కాదని ప్రకటించిన ప్రభుత్వం.. దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక, పథకాలు పంపిణీ వంటి ప్రక్రియల కోసం మార్చి 31 వరకూ గడువు పెంచింది. కానీ తొలుత ఇచ్చిన మాట ప్రకారం.. రిపబ్లిక్ రోజున పథకాలు పంపిణీ చేయాల్సి ఉన్నందున మండలానికి ఒక పైలట్ గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆ గ్రామంలోని అర్హులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల మంజూరు పత్రాలను అందజేసింది. కానీ రిపబ్లిక్‌డే ఆదివారం కావడంతో బ్యాంకులకు సెలవు ఉన్నందున రైతుభరోసాను అదే రోజు అర్ధరాత్రి తరువాత జమచేస్తామంటూ నారాయణపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎకరానికి రూ.6 వేల చొప్పున తొలి విడత సాయం జమ చేస్తామని, జనవరి 26న అర్ధరాత్రి 12 గంటల తరువాత రైతుభరోసా సాయం జమ అవగానే రైతుల ఫోన్లన్నీ 'టింగ్.. టింగ్..' అంటూ మెసేజీలతో మోగుతాయని, రైతులందరూ ఆ మెసేజీలను నిర్ధారించుకొని పంటల సాయన్ని అందుకోవాలని సూచించారు. కానీ మరుసటి రోజైన జనవరి 27న రాత్రి వరకూ చూసినా జిల్లాలోని రైతులెవరికీ రైతుభరోసా నిధులు జమ కాలేదు. కేవలం ఎంపిక చేసిన పైలట్ గ్రామాల్లోని రైతుల ఖాతాల్లో మాత్రమే సోమవారం సాయంత్రం రైతుభరోసా నిధులు జమ అయ్యాయి.

రైతుభరోసా మెసేజీ కోసం ఫోన్ చూస్తున్న రైతు

ఖమ్మంలో 20,802 మంది రైతులకే..

రైతుబంధు విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన విధానానికి భిన్నంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. తొలుత ఎకరంలోపు, ఎకరం సాగుభూమి ఉన్న రైతుల నుంచి మొదలుపెట్టి.. ఆఖరుకు అధిక విస్తీర్ణంలో సాగుభూమి ఉన్న రైతుల వరకూ రైతుబంధును జమ చేసేది గత కేసీఆర్ ప్రభుత్వం. కానీ, మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం కేవలం ఒక్కో మండలానికి ఒక గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసి అక్కడి రైతులకు మాత్రమే రైతుభరోసాను జమ చేసింది. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని 21 మండలాల్లోని 21 పైలట్ గ్రామాల రైతులకు మాత్రమే సోమవారం రైతుభరోసాన జమ చేసింది. ఖమ్మం జిల్లాలోని 21 గ్రామాలకు చెందిన 20,802 మంది రైతుల ఖాతాల్లో రూ.28.42 కోట్లు జమ అయినట్లు అధికారులు ప్రకటించారు. కానీ, ముఖ్యమంత్రి చెప్పినట్లుగా ఇదే రైతుభరోసా సాయం తమ ఖాతాల్లోనూ జమ అవుతుందని భావించిన జిల్లా రైతులు సోమవారం నుంచి రాత్రి వరకూ ఎదురుచూశారు. చివరికి తీవ్ర నిరాశతో నిట్టూర్చారు. ఇరుగుపొరుగు రైతులను పలుకరించి సమాచారం తెలుసుకున్నారు. వారికేమైనా సాయం జమ అయిందేమోనని ఆరా తీశారు. ఎవరికీ జమ కాలేదని తెలుసుకొని నిస్సహాయత వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలూ నమ్మేలా లేవని ఈసడించుకున్నారు.

మిగిలిన గ్రామాల రైతులకు స్పష్టత కరువు

ఖమ్మం జిల్లాలో ఎకరానికి రూ.6 వేల చొప్పున తొలి రోజున కేవలం 20 వేల మందికే సాయం అందింది. కానీ, మిగిలిన గ్రామాల రైతులకు పంటల పెట్టుబడి సాయం ఎప్పుడు అందుతుందోననే అంశంపై స్పష్టత కరువైంది. తమకు సాయం జమ చేసే అంశంపై ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందోనని ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారుల గణంకాల ప్రకారం.. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 3.50 లక్షల మంది రైతులు 7.41 లక్షల ఎకరాల సాగుభూమి కలిగి ఉన్నారు. ప్రస్తుతం కేవలం 20 వేల మందికి మాత్రమే సాయం అందింది. అంటే మొత్తం రైతుల్లో కనీసం పది శాతం మందికి కూడా సాయం అందలేదు.

ఖమ్మం జిల్లా వివరాలు ఇలా..

సాగుకు అనుకూలమైన భూములు	7,41,322 ఎకరాలు
రైతుభరోసా ద్వారా జమ కావాల్సిన నిధులు	రూ.444.09 కోట్లు
భరోసా పథకానికి అర్హత కలిగిన రైతులు	3,51,592 మంది
సాగుకు యోగ్యం కాని భూములు	5,200 ఎకరాలు
తొలిరోజు భరోసా పొందిన రైతులు	20,802 మంది
వారికి జమ అయిన పెట్టుబడి సాయం	రూ.28.42 కోట్లు

భరోసా మెసేజీ కోసం చూస్తున్న మహిళా రైతు

భద్రాద్రి జిల్లాలోనూ 22,125 మంది రైతులకే..

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 27 (నమస్తే తెలంగాణ): భద్రాద్రి జిల్లాలోనూ కేవలం 22,125 మంది రైతులకు మాత్రమే సోమవారం రైతుభరోసా అందింది. జిల్లాలో రైతుభరోసా కోసం 1,87,597 మంది రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగి ఉన్నారు. వీరిలో కేవలం 22,125 మంది రైతులకు చెందిన 64,853 ఎకరాలకు గాను రూ.39 కోట్లు జమ అయ్యాయి. అది కూడా కేవలం పది ఎకరాల్లోపు ఉన్న వాళ్లకే జమ అయినట్లు రైతులు చెబుతున్నారు. 1.23 లక్షల మంది రైతులకు రూ.335 కోట్లు జమ కావాల్సి ఉంది. కాగా, అధికారులు ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించి 2,800 ఎకరాలను లేఅవుట్లు చేసినట్లు గుర్తించారు.

రైతులందరికీ 'భరోసా' వస్తుంది..

జిల్లాలో అర్హులైన రైతులందరికీ రైతుభరోసా వస్తుంది. ఇటీవలి సర్వే ప్రకారం జిల్లాలో 1,87,597 మంది రైతులు ఉన్నారు. జిల్లాలో ఉన్న సాగు భూముల్లో 2,800 ఎకరాలను లేఅవుట్లు చేసినట్లు గుర్తించాం. ఈ 2,800 ఎకరాలకు రైతుభరోసా రాదు. మిగిలిన అందరికీ రైతుభరోసా అందుతుంది.

-బాబూరావు, డీఏవో, భద్రాద్రి కొత్తగూడెం

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ : ఐటీడీఏ పీవో రాహుల్

అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 27: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, పదో తరగతి విద్యార్థుల స్టడీ అవర్స్ సక్రమంగా జరిగేలా సంబంధిత హెచ్ఎంలు, వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అర్జీలన్నీ సంబంధిత యూనిట్ అధికారులు గ్రామాల వారీగా ఆన్‌లైన్‌లో పొందుపరిచి అర్హులకు సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఎస్టీసీ రవీంద్రనాథ్, ఏపీవో పవర్ వేణు, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, పీవీటీజీ అధికారి మనిధర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏసీబీ వలలో సత్తుపల్లి మున్సిపల్ వార్డు అధికారి

- ప్రత్యేకాధికారి పాలన మొదటిరోజే అవినీతికి పాల్పడిన ఉద్యోగి

ఏసీబీ అధికారులకు నగదుతో పట్టుబడిన సత్తుపల్లి మున్సిపల్ వార్డు అధికారి వినోద్‌కుమార్

సత్తుపల్లి టౌన్, జనవరి 27: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారి నల్లటి వినోద్ కుమార్ అవినీతికి పాల్పడుతూ ఏసీబీ అధికారులకు సోమవారం నేరుగా దొరికిపోయాడు. ఇటీవల ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తామని గ్రామసభలు నిర్వహించింది. ఈ గ్రామసభల్లో లబ్ధిదారులు తమ పేరు జాబితా లిస్టులో ఉండేలా చూడాలని వార్డు అధికారులను వేడుకుంటున్నారు. ఇదే అదునుగా భావించి కొందరు వార్డు అధికారులు మంజూరు లిస్ట్‌లో పేరు ఉండాలంటే తమకు కొంత నగదు ముట్టచెప్పాలని లబ్ధిదారులను లంచం అడుగుతున్నారు. సత్తుపల్లి పట్టణంలోని 23వ వార్డుకు చెందిన ఓ మహిళ వద్దకు వార్డు అధికారి వినోద్ కుమార్ వచ్చాడు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డు కావాలంటే తనకు రూ.3 వేలు ఇస్తే లిస్టులో పేరు వచ్చేలా చేస్తానని తెలిపాడు. దీంతో ఆ మహిళ ఖమ్మంలోని ఏసీబీ కార్యాలయానికి నేరుగా వెళ్లి సదరు వార్డు అధికారిపై ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఏసీబీ అధికారులు సత్తుపల్లిలో ఈ నెల 25న రెక్కీ నిర్వహించారు. 27న సోమవారం మధ్యాహ్నం పాత సెంటర్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న జ్యూస్ సెంటర్ వద్దకు వచ్చి నగదు ఇవ్వాలని సదరు ఉద్యోగి.. మహిళకు చెప్పడంతో ఆ మహిళ ఏసీబీ అధికారులు కెమికల్ కలిపి ఇచ్చిన రూ.2,500 నగదును వార్డు అధికారికి ఇచ్చింది. అక్కడే మాటు వేసి ఉన్న ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ తన సిబ్బందితో సదరు ఉద్యోగిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వినోద్ కుమార్‌ను వరంగల్ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అధికారులు లంచం అడిగితే 1064 నెంబర్‌కు కానీ, 9154388981 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పాలకవర్గం ఈ నెల 26న ముగిసిపోయి ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నది. ప్రత్యేక అధికారి పాలన మొదటిరోజునే ఇలా జరగడంతో అధికారుల పాలనలో జవాబుదారీతనం ఎలా ఉంటుందోనని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. మరోపక్క పదవి పూర్తయిన పాలకవర్గం సభ్యులు తమ హయాంలో లంచాలకు తావులేకుండా పాలన కొనసాగిందని, తమ పాలన పూర్తయిన వెంటనే మున్సిపల్ కార్యాలయం లంచగొండితనం బయటపడిందని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

అర్హులకు పథకాలివ్వకుంటే ప్రభుత్వాన్ని ఎండగడతాం

బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

అశ్వాపురం, జనవరి 27: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అమలు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలు చేడపతామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో సోమవారం జరిగిన బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన గ్రామసభల ద్వారా దరఖాస్తుల స్వీకరణ కేవలం ప్రజలను మభ్యపెట్టడానికే కానీ ప్రజలకు మేలు చేసేందుకు కాదని విమర్శించారు. పేదలందరికీ ఇండ్లు మంజూరు చేయకుండా దరఖాస్తుదారుల పేర్లు చదివి అధికారులు చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. అర్హులను గుర్తించలేని గ్రామసభలు ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన మొత్తం దరఖాస్తుల స్వీకరించడానికే సరిపోయిందని, టైంపాస్ పాలన చేస్తూ ప్రజలను గోసపెడుతోందని ప్రభుత్వాన్ని దయ్యబట్టారు. దరఖాస్తుదారుల ఇంటికెళ్లి ఫొటోలు తీసిన అధికారులు అర్హులను గుర్తించడంలో విఫలమయ్యరని అన్నారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల జిమ్మిక్కుల కోసమే ప్రభుత్వం హడావిడిగా గ్రామసభలు నిర్వహిస్తోంది తప్ప ప్రజలకు లబ్ధి కోసం కాదని ఆరోపించారు. ప్రజలు పెట్టిన ప్రతి దరఖాస్తుకు ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మండల నాయకులు కొల్లు మల్లారెడ్డి, కంచు గట్ట వీరభద్రం, కందుల కృష్ణార్జున్, మర్రి మల్లారెడ్డి, ఈదర సత్యనారాయణ, వెన్న అశోక్‌కుమార్, సూదిరెడ్డి గోపిరెడ్డి, చిలక వెంకటరామయ్య, గద్దల రామకృష్ణ, తోకల లత, నక్కబోయిన పాపారావు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి కోసం ఆగిన గుండె

- అర్హుల జాబితాలో కుమారుడి పేరులేక తండ్రి మనస్తాపం
- గుండెపోటుతో మృతి..

చాట్ల కృష్ణయ్య (ఫైల్)

ఖమ్మం రూరల్, జనవరి 27: ఇందిరమ్మ ఇంటి కోసం ఓ తండ్రి గుండె ఆగిపోయిన ఘటన ఖమ్మం జిల్లాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ నెల 21 నుంచి 24 వరకూ జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం.. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అర్హుల జాబితాను వెల్లడించింది. ఆ జాబితా ఆసాంతం అనర్హుల పేర్లే ఉండడం, అర్హులు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. చివరికి నామమాత్రంగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అయితే, అర్హుల జాబితాలో తమ పేర్లు లేకపోవడం, అన్నీ అనర్హుల పేర్లే ఉండడంతో అసలైన పేదలు తీవ్ర ఆవేదనతో ఉన్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లిలో ఈ నెల 23న జరిగిన గ్రామసభలో తన కుమారుడు రాము పేరు ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితా లేదని అతడి తండ్రి చాట్ల కృష్ణయ్య (62) తెలుసుకున్నారు. పేద కుటుంబం అయినప్పటికీ ప్రభుత్వం తన కుమారుడిని ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక చేయకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. అప్పటి నుంచి అదే బాధతో మదనపడుతూ ఉంటున్న కృష్ణయ్య.. ఆదివారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ సిద్దినేని కోటయ్య, సీపీఎం నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు తదితరులు వచ్చి కృష్ణయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద కుటుంబానికి చెందిన కృష్ణయ్య కుమారుడికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయకపోవడం దారుణమని అన్నారు.

సరిహద్దులను చెరిపేస్తారా..?

- తెలంగాణ సరిహద్దులో ఆంధ్రా అధికారుల సర్వే
- రోడ్డు విస్తరణ పనుల పేరుతో మార్కింగ్‌లు
- ఆందోళన చెందుతున్న తెలంగాణ ప్రజలు

తెలంగాణ సరిహద్దులు దాటుకుని హద్దులు గుర్తిస్తున్న ఆంధ్రా అధికార సిబ్బంది

ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన మార్కింగ్

అశ్వారావుపేట టౌన్, జనవరి 27: తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అశ్వారావుపేట శివారులో ఆంధ్రా - తెలంగాణ సరిహద్దులను ఏకపక్షంగా గుర్తించే ప్రయత్నం మరోమారు తెరపైకి వచ్చింది. పర్యాటక కేంద్రంగా పోలవరం ప్రాంత అభివృద్ధిలో భాగంగా ఆంధ్రా ప్రభుత్వం తెలంగాణ సరిహద్దులోని జీలుగుమిల్లి మండలం తాటాకులగూడెం గ్రామం నుంచి అంకంపాలెం మీదుగా బుట్టాయిగూడేన్ని కలుపుకుంటూ పోలవరం వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా అశ్వారావుపేట పట్టణ శివారు గ్రామమైన నందమూరినగర్ వద్ద జాతీయ రహదారిపై అక్కడి అధికారులు సరిహద్దులు గుర్తించే పనులు చేపట్టారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా గతంలో ఉన్న తెలంగాణ సరిహద్దులను దాటుకుని సుమారు 100 మీటర్లు లోపలికి వచ్చి మార్కింగ్‌లను గుర్తించారు. ఇదే పరిస్థితి గతంలో కూడా నెలకొన్నది. ఏకంగా 150 మీటర్లు లోపలకు వచ్చి దిమ్మ సైతం కట్టారు. దీంతో పత్రికల్లో కథనాలు రావడం, తెలంగాణ అధికారులు చర్యలు చేపట్టడంతో ఆంధ్రా అధికారులు ఆ పనులను విరమించుకున్నారు. మళ్లీ ఇప్పుడు రోడ్డు విస్తరణ పనుల పేరుతో తెలంగాణ సరిహద్దులోకి చొరబడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అంగుళం భూమి కూడా వదలం..

సరిహద్దుల్లో ఆంధ్రా అధికారులు హద్దులు వేస్తున్న సంగతి తెలిసింది. అధికారికంగా ఎటువంటి సమాచారం మాకు అందించలేదు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అశ్వారావుపేట, నందమూరినగర్ ప్రాంతంలో మాత్రం మార్కెట్ వ్యాల్యూ ఎలా ఉందని అక్కడి అధికారులు అడిగారు. కానీ సరిహద్దులు గుర్తిస్తున్నట్లు చెప్పలేదు. అయినా తెలంగాణలోని ఒక్క అంగుళం భూమిని కూడా వదిలేయం.

– కృష్ణప్రసాద్, అశ్వారావుపేట తహసీల్దార్

రవిని పరామర్శిస్తున్న తాతా మధు, మెచ్చా నాగేశ్వరరావు

బీఆర్ఎస్ నేతలపై దాడి హేయం

పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం, జనవరి 27: బీఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో నాలుగు పథకాల అమలుకు ఆదివారం ఏర్పాటు చేసిన గ్రామసభలో బీఆర్ఎస్ నాయకుడు కొడెం రవిపై కాంగ్రెస్ పార్టీ నేతలు దాడి చేయగా తలకు బలమైన గాయమై ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం తాతా మధు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మచ్చా నాగేశ్వరరావుతో కలిసి రవిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవికి న్యాయం జరిగే వరకూ పార్టీ తరపున పోరాడుతామని అన్నారు. గ్రామసభలో ఇటువంటి దాడి జరగడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ గూండాల దుశ్చర్యను పార్టీ ఖండిస్తున్నదన్నారు. దాడికి పాల్పడిన ప్రతిఒక్కరికి శిక్షపడేలా చూస్తామని, రవికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖమ్మంరూరల్ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, నాయకులు మేడ మోహన్‌రావు, అశ్వారావుపేట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవంత్ సర్కారు మోసం చేసింది..

- ఎన్నికల హామీలను అమలు చేకుండా అన్యాయం చేస్తోంది
- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికులు

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, జనవరి 27: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా రేవంత్ సర్కారు తమను మోసం చేసిందని మధ్యాహ్న భోజన కార్మికులు మండిపడ్డారు. ఏళ్లు గడుస్తున్నా తమ సమస్యలు పరిష్కరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకురాలు సత్తెనపల్లి విజయలక్ష్మి మాట్లాడారు. ఎన్నికల సమయంలో తమకు అనేక హామీలు ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక ఆ హామీల ఊసే మర్చిపోయారని విమర్శించారు. తమకు కనీస వేతనాలు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా నగదు, బిల్లులు చెల్లించాలని, వంటశాలల్లో సౌకర్యాలు కల్పించాలని, గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు కంచర్ల జమలయ్య, బండి నాగేశ్వరరావు, గిరి, ప్రభావతి, మంగా సరోజచ బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు